క్లుప్తంగా

ఏకచక్రేశ్వరాలయాన్ని పునర్నిర్మిస్తాం



బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వ మందిరాన్ని దేవాదయ శాఖ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ స్తపతి వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. ఆలయ ఆవరణలో తిరిగారు. ఆలయ పునర్నిర్మాణం, రాజగోపురాలు, ప్రకార మండపం, అన్నదాన సత్రం, కల్యాణ మండపం నిర్మాణ పనులకు ప్లానింగ్, ఎస్టిమేషన్ వేయడానికి వచ్చామని అసిస్టెంట్ స్తపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ అసిస్టెంట్ స్తపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్యాం, లక్ష్మణ్ పటేల్, అర్చకులు గణేశ్, మహేశ్ మహారాజ్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



నవీపేట : మండల కేంద్రంలోని చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జీపీ కో ఆప్షన్ మెంబర్ ముస్తాక్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు వడ్డెరవి, నారాయణ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ శిబిరం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మధు 30 రోజులుగా 65 మంది విద్యార్థులకు వాలీబాల్ క్రీడలో శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



వేల్పూర్ : వేల్పూర్ మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీలకు వేసవి తాపం తీర్చడానికి సర్పంచ్ తీగెల రాధామోహన్ గురువారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 200 మంది కూలీలకు మజ్జిగ అందజేశారు. రెండేళ్ల నుంచి ప్రతి వేసవిలో మజ్జిగ వితరణ చేస్తుండడంతో కూలీలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి వినోద్‌కుమార్, ఎఫ్ఏ శ్రీకాంత్, మహిపాల్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



నవీపేట : మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గతేడాది చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే షకీల్ గురువారం అందజేశారు. బోధన్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో బాధితుడి కుటుంబ సభ్యులకు ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, బీఆర్ఎస్ నాయకులు గైని సతీష్, ఒమర్, అప్సర్, అలీమ్, సురేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం..

బోధన్ : బోధన్ ఏకచక్రేశ్వరాలయం మాజీ చైర్మన్ పాల్వార్ సాయినాథ్ రెండేళ్ల క్రితం మృతి చెందారు. గురువారం పట్టణ కేంద్రంలోని స్వగృహంలో ఎమ్మెల్యే షకీల్ సాయినాథ్ సతీమణి సుజాతకు రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధకృష్ణ, నాయకులు శివకుమార్ అప్పా తదితరులు పాల్గొన్నారు.



పండుగలా ఉత్సవాలు జరగాలి

- దశాబ్ది సంబురాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవ్వాలి
- ఎమ్మెల్యే షకీల్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్‌టౌన్(బోధన్) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలనుసారం ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా ఆయాశాఖల అధికారులు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలు పండుగలా జరుపుకోవాలన్నారు. ఉత్సవాల మొదటి రోజున నియోజకవర్గంలోని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో, పట్టణంలో పార్టీ జెండాలు ఎగుర వేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులపై ఆరా..

నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆయాశాఖల అధికారులతో పాటు బల్దియా కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందంను అడిగి తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదన్నారు. అసంపూర్తి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తవ్వాలి..

తెలంగాణ రాష్ట్ర అవరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 2వ తేదీన నిర్వహించే దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా బల్దియా అధికారులను ఆదేశించారు. గురువారం బోధన్ మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, ఏఈలు శ్రీనివాస్, శివకృష్ణ ఉన్నారు.



పోతంగల్‌లో రైతువేదికను పరిశీలిస్తున్న ఎంపీడీవో



ఆర్మూర్‌లో ముస్తాబైన మున్సిపల్ కార్యాలయం



బోధన్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా



ఆర్మూర్‌లో తహసీల్దార్ కార్యాలయం

నేడు ఆర్మూర్ మున్సిపాలిటీలో..

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఉదయం 8:30గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత చేతుల మీదుగా పతాకావిష్కరణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తెలిపారు. ఈ పతాకావిష్కరణకు మున్సిపల్ వైస్ చైర్మన్ మున్ను, కౌన్సిలర్‌లు, అధికారులు, పుర ప్రముఖులు పాల్గొనాలని కోరారు. పట్టణంలోని మున్సిపల్, పోలీస్, తహసీల్దార్, మార్కెట్ కార్యాలయాలు సంబంధింత విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు.

రైతు వేదికల్లో ఏర్పాట్ల పరిశీలన

రుద్రూర్ : కోటగిరి మండలంలోని రాంపూర్, ఎత్తోండ, పోతంగల్, హెగ్డోలి, కొత్తపల్లి, కోటగిరి రైతువేదికల వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను గురువారం మండల అభివృద్ధి అధికారి మనోహర్ రెడ్డి పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు వేదిక వద్ద రైతు దినోత్సవం నిర్వహించడంతో పాటు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి. ఇందుకోసం అవసరమగు ఏర్పాట్లు పూర్తిచేయాలని వ్యవసాయ విస్తీర్ణాధికారులకు సూచించారు.

కరెంట్ పోయిందా.. సిగ్నల్ గోవిందా!

- డొంకేశ్వర్‌లో మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్
- అత్యవసర సమయంలో సిగ్నళ్లు లేక పరేషాన్
- సమస్యను పట్టించుకోని అధికారులు



డొంకేశ్వర్ మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మొరాయిస్తోంది. కరెంట్ పోతే చాలు సెల్‌ఫోన్లలో సిగ్నల్ ఉండడం లేదు. బ్యాటరీ బ్యాకప్ లేక గత ఐదేళ్లుగా కేవలం కరెంట్ సరఫరా ఆధారంగానే సెల్ టవర్ నడుస్తోంది. వర్షా, ఎండాకాలంలో కరెంట్ కోతలు అధికంగా ఉండడంతో సిగ్నళ్ల సమస్య తీవ్రంగా మారుతోంది. సంబంధిత అధికారులు మాత్రం సమస్యను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ డొంకేశ్వర్‌లో 30 ఏళ్ల క్రితం సెల్ టవర్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ ఇదే తొలి టవర్ కావడంతో డొంకేశ్వర్‌తో పాటు చుట్టుపక్కల రెండు,మూడు గ్రామాల ప్రజలు కూడా బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డులను కొనుగోలు చేసి వాయిస్‌కాల్, ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. దాదాపు 1,500 మంది వినియోగదారులుండగా, బ్రాడ్ బ్రాండ్ కనెక్షన్లు సైతం ఉన్నాయి. మండల వాసులు నమ్మకంతో ఏళ్ల తరబడి బీఎస్ఎన్ఎల్‌ను వాడుతున్నారు. కానీ, గత నాలుగైదేళ్లుగా సెల్ టవర్ సతాయిస్తోందని, కరెంట్ పోతే సెల్‌ఫోన్లలో సిగ్నళ్లు ఉండడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. అత్యవసర సమయంలో కాల్స్ మాట్లాడలేకపోతున్నామని, ఇంటర్నెట్ సేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఒక్కోసారి కుటుంబ సభ్యులతో మాట్లాడలేని పరిస్థితి ఏర్పడుతోందని చెప్పన్నారు. కరెంట్ పోతే బ్యాంకుల్లో కూడా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతున్నాయి. బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా లేకపోవడంతో వినియోగదారులు వేరే నెట్‌వర్క్‌కి మారుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



చాల ఏళ్లుగా బీఎస్ఎన్ఎల్ వాడుతున్నాను. గత కొంత కాలంగా కరెంట్ పోతే సెల్ టవర్ నుంచి సిగ్నళ్లు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి ఫోన్‌లో మాట్లాడుతుండగానే సిగ్నల్ కట్ అవుతోంది. దీంతో వేరే నెట్‌వర్క్ నుంచి మళ్లీ కాల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సాయి కుమార్, డొంకేశ్వర్

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలో వినియోగదారులు చాలా మంది ఉన్నారు. కరెంట్ పోతే ఎదురయ్యే సిగ్నళ్ల సమస్యతో పరేషాన్ అవుతున్నాం. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి. కరెంట్ పోయినా అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలి.

– రామాగౌడ్, డొంకేశ్వర్

టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు చొరవ చూపాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 317 జీవో ద్వారా స్థానిక కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, మిగిలిపోయిన స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయంబర్స్‌మెంట్, సెలువ వేతనాలు, పీఆర్సీ బకాయిలు, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ప్రతి నెల మొదటి రోజున వేతనాలు విడుదల చే యాలని, బకాయిలుగా ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు జేఏసీగా ఏర్పడి ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీ సత్యానంద్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి మల్లేష్, కార్యదర్శులు రాజారాం, గంగాధర్, సాయన్న, నాయకులు బాబు, పద్మావతి, భూమేశ్వర్, బాలరాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

సిరికొండ : మండలంలోని గడ్కోల్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌ను నవయువ యూత్ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలో జగన్‌ను గడ్కోల్‌కు చెందిన నవయువ యూత్ సభ్యులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు.

5 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలే దీక్షలు

నిజామాబాద్ అర్బన్ : ఈనెల 5 రుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలే దీక్షలు చేపడుతున్నట్లు గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కార్మికులకు సంబంధించిన బిల్లులు సుమారు రూ. 8 కోట్ల బకాయిలు ఉంటే ఎన్నిసార్లు ఆందోళన పోరాట కార్యక్రమాలు నిర్వహించిన అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన నేటికీ రూపాయి చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 2000 వేతనం పెంచుతున్నామని, మార్చ్ 2022 నుంచి వాటిని అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించినా నేటికీ అమలు కావడం లేదన్నారు. కోడిగుడ్ల ధరలు ఆకాశాన్ని తాకినా వాటికి సంబంధించిన డబ్బులు కార్మికులకు చెల్లించకుండా కోడిగుడ్లు విద్యార్థులకు పెట్టాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	అహింస (తెలుగు) 9.50, 6.45, 10.10; ఫాస్ట్ ఎక్స్-3డీ 1.15; చక్రవ్యూహం – 4.15
స్క్రీన్-2 –	2018- 9.50, 10.20; బిచ్చగాడు(2) -1.00, మేమ్‌ఫేమస్ -4.15, పరేషాన్ - 7.25
స్క్రీన్-3 –	నేను స్టూడెంట్ సర్ - 10.15, 7.40, 10.30, అహింస- 1.05, 2018- 4.30
స్క్రీన్-4 –	స్పైడర్‌మాన్ అక్రాస్(తెలుగు)- 10.00, 4.10, స్పైడర్‌మాన్ అక్రాస్ (ఇంగ్లిష్) - 1.05, 7.15, 10.20



పంటకాలంపై సూచనలివ్వడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

వర్ని : ఒకపక్క రోహిణిలో రైతులు నాట్లు వేస్తుంటే స్పీకర్ మాత్రం నారుమడులు వేసుకోవాలని సూచనలు ఇవ్వడం స్పీకర్‌కు పంటలపై అవగాహన ఎంతుందో అర్థమవుతుందని, రైతులకు పంటకాలంపై సలహాలు సూచనలు ఇచ్చే పరిస్థితుల్లో స్పీకర్ లేరని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు పీసీసీ డెలిగేట్ ఎలమంచిలి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో మాట్లాడారు. పంటకాలం జరుపుకోవాలని స్పీకర్ రైతులకు సలహాలు ఇవ్వడం సరికాదన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులే ముందుగా నారుమడులు వేసుకొని నాట్లు వేసి ప్రతికూల పరిస్థితుల కంటే ముందే పంటను కోసి ధాన్యాన్ని విక్రయిస్తున్నారని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులే పంటలు వేసుకుంటున్నారని ఈ పరిస్థితుల్లో రైతులకు స్పీకర్ గాని, అధికారులు గాని, ప్రభుత్వం గానీ సూచనలు సలహాలు ఇస్తే రైతులు వినే పరిస్థితుల్లో లేరని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద కొనుగోలు చేసి న ధాన్యానికి 20 రోజులుగా డబ్బులు చెల్లించకుండా రూ. 600 కోట్ల బకాయి పడ్డారని వెంటనే వా టిని రైతులకు చెల్లించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో రైతుబంధు, సాగునీటి విడుదల, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పంట నిల్వ కొరకు గిడ్డంగుల ను ఏర్పాటు చేయకుండా కాలం వెళ్లదీసే పనులు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో వర్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కులకర్ణి సురేష్ బాబా, యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు పీసీసీ డెలిగేటు కునిపూర్ రాజిరెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగా ప్రసాద్, మండల కిసాన్ కేత్ అధ్యక్షులు గంగప్ప, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎగ్బాల్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు శ్రీహరి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రెడ్డి రాంబాబు, కోశాధికారి వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా త్రిశక్తి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపన



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో శ్రీ రామదాసి సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో త్రిశక్తి ఆలయ విగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవం హైందవ ధర్మ సేవారత్న, దివ్య సంజీవని, హనుమాన్ ఆశ్రమ వ్యవస్థాపకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్రిశక్తి అమ్మవారి మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏసీపీ కిరణ్‌కుమార్, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు యాజ్ఞికులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

నిజామాబాద్ సిటీ: స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హెచ్ఐవీ సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో సుదర్శనం పేర్కొన్నారు. గురువారం నగరంలోని నెహ్రూపార్క్ అడ్డమీది కూలీలకు సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూలీల హెచ్ఐవీ స్థితిని తెలుసుకుని సురక్షితంగా ఉండాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన ఏఆర్‌టీ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం సురక్ష హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం స్టాల్‌ను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, జిల్లా టీబీ, హెచ్ఐవీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, కౌన్సెలర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



సుర్బిర్యాల్ గ్రామంలో సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సట్లపల్లి సవిత అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ఎన్ఆర్‌జీఎస్ పథకంలో చేపట్టిన పనులను గుర్తించారు. గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన రూ.90 లక్షలను కూలీలకు చెల్లించగా ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 17 సిమెంటు కల్లాలు, సీసీ రోడ్లు, కంపోస్టు షెడ్లు, వైకుంఠదామం నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త సట్లపల్లి గణేష్, సామాజిక తనిఖీ బృందం అధికారులు ఎం.సంధ్య, ప్రియాంక, కే.రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, కారోబార్ యోగేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ ఆలయ ఉద్యోగి మృతి



సత్యనారాయణ(ఫైల్)

నిజామాబాద్ సిటీ : నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే సత్యనారాయణ బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. సత్యనారాయణ మెదడులో కణితి కావటంతో ఆరోగ్యం దెబ్బతినగా నెలక్రితం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వ్యాధి నయం కాలేదు. చికిత్స నిమిత్తం డబ్బులు సరిపోకపోవడంతో ఇటీవలే నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవాదాయ సహాయక కమిషనర్ ఎస్ సుప్రియ, కంఠేశ్వర్ ఆలయం ఈవో వేణు, ఇతర సిబ్బంది వెంటనే ఆస్పత్రికి చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం మృతుడి భార్యకు కమిషనర్ అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ. 10 వేలు అందజేశారు. మృతుడి స్వస్థలం కామారెడ్డిలోని రామారెడ్డికి తీసుకెళ్లగా గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన మృతిపట్ల ఉమ్మడి జిల్లాల అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ రాములు, ఎస్ సురేందర్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఉద్యోగు ల సంఘం తరపున రూ. 5 వేలు మృతిచెందిన కుటుంబానికి అందజేశారు.

కళాశాలను బలోపేతం చేయాలి

ఆర్మూర్‌టౌన్ : అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలను మరింత బలోపేతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ నర్సయ్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలుర)లో నూతనంగా రెగ్యులరైజ్ అయిన అధ్యాపకులకు కళాశాల ఆధ్వర్యంలో సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వర్ణ, రవి, దేవదాస్, లక్ష్మి, భూపాల్, సురేష్, చంద్రశేఖర్, సుభాష్, నరేష్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలపై అవగాహన ర్యాలీ



రుద్రూర్ : రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రా మంలో గురువారం ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో తృణధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అక్బర్‌నగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ తృణ ధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. తృణ ధాన్యాల్లో మంచి పోషకాలు ఉంటాయని, వ్యాధులను దరి చేరనీయవన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల కు చాలా మంచివని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆర్ స్వామి, అసిస్టెంట్ ప్రొ ఫెసర్లు ప్రశాంతి, సమ్రిన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899